క్లుప్తంగా...

విద్యుత్ అంతరాయంతో ఇక్కట్లు

లాలాపేట: విద్యుత్ సరఫరాలో తరచూ తలెత్తుతున్న అంతరాయంతో లాలాపేట సత్యనగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు తార్నాక, లాలాపేట, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో అప్పుడప్పుడు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో బయట ఎండ, ఇంట్లో ఉక్కపోతకు ఉక్కిరి బిక్కిరి అవుతున్నామన్నారు. వర్క్‌ఫ్రం చేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కార్యకలాపాలు నిలిచిపోతున్నాయి. దీనిపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

సన్మానం



అనీల్‌కుమార్‌యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

అమీర్‌పేట్: సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన ఎం. అనిల్‌కుమార్ యాదవ్‌ను సనత్‌నగర్ నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం ఉదయం అమీర్‌పేట్‌లోని జిజ్ఞాస బ్యాంకట్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరవ్వగా నాగేందర్‌రాజ్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా



మర్రి శశిధర్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

రాంగోపాల్‌పేట్: బీజేపీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి బోయిగూడలో నిర్వహించిన బన్సీలాల్‌పేట్ డివిజన్ బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డివిజన్‌లోని సమస్యల గురించి పోరాటం చేస్తూ ప్రభుత్వాన్ని దీటుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ రెడ్డి, రవీందర్, హరనాథ్ నాయి, ఆనంద్ యాదవ్, ఉమేష్ ఖండేల్వాల్ పాల్గొన్నారు.

పార్ట్‌టైమ్ లెక్చరర్లకు పదోన్నతి కల్పించాలి



దునుకు వేలాద్రి

లాలాపేట: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పని చేస్తున్న పార్ట్‌టైమ్ లెక్చరర్లకు అసిస్టెంట్ ప్రొఫెసర్స్(కాంట్రాక్టు)గా పదోన్నతి కల్పించాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షులు దునుకు వేలాద్రి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల్లో దాదాపుగా 775 మందికి పైగా పార్ట్‌టైం లెక్చరర్లుగా విధులు నిర్వహిస్తున్నారని చాలా యూనివర్సిటీల్లో రెగ్యులర్ అధ్యాపకుల కొరత కారణంగా పని భారమంతా వీరిపైనే పడుతుందన్నారు. కాబట్టి 16 గంటల వర్క్‌లోడ్ ఉన్న అర్హత గల లెక్చరర్లకు పదోన్నతులు ఇవ్వాలని ఈ విషయమై త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖా మంత్రిని కలుస్తామన్నారు.

అలరించిన కళా ఉత్సవ్



విద్యార్థులకు జ్ఞాపికను అందిస్తున్న చైతన్య

రాంగోపాల్‌పేట్: మేఘనాస్ రిథం మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ హరిహరకళా భవన్‌లో నిర్వహించిన కళా ఉత్సవ్ ప్రేక్షకులను అలరించింది. ఇనిస్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు ప్రత్యేక ఆటాపాటలతో ఆకట్టుకున్నారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే ప్రదర్శనతో పాటు శాస్త్రీయ సంగీతం, వయోలిన్, వీణా, తబలా వంటి వాయిద్యాలతో పాటు భరత నాట్యం, కూచిపూడి, కథక్ వంటి శాస్త్రీయ నృత్యాలతో అందరిని మంత్రముగ్ధుల్ని చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాయిని స్ఫూర్తి జితేందర్, బలగం ఫేం సంజయ్, వర్ధమాన నటుడు చైతన్యరావు, వెంకటేశ్వరరావు, ఆర్‌జే శ్వేత హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మరుగున పడుతున్న సంస్కృతి, సాంప్రదాయాలు, కళలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు.

వీళ్లు.. మారరంతే..

పబ్బుల ఎదుట రోడ్లకు ఇరు వైపులా అక్రమ పార్కింగ్‌లు







- కేసులు నమోదైనా పట్టించుకోని యాజమాన్యాలు
- జూబ్లీహిల్స్‌లో అర్ధరాత్రి దాటినా ట్రాఫిక్ సమస్య

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పరిధిలో పబ్‌ల నిర్వహణ అధ్వానంగా మారుతోంది. పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనాలను రోడ్లకు ఇరువైపులా అక్రమ పార్కింగ్ చేస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి పబ్ కస్టమర్ల కార్లను రోడ్లపైనే పార్కింగ్ చేసేలా ప్రోత్సహిస్తోంది. ఫలితంగా జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36, 45, 10, 1 ప్రాంతాల్లో రాత్రి 8 నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు వాహనదారులు నరకం చూస్తున్నారు. ప్రతి రోడ్డూ రెండువైపులా అక్రమ పార్కింగ్‌లతో కిటకిటలాడుతోంది. బంజారాహిల్స్ రోడ్ నెం. 45లోని ఫ్యాట్ పీజియన్ పబ్‌కు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో కార్లన్నీ రోడ్డుకు రెండువైపులా బారులు తీరుతున్నాయి. రాత్రి పూట ఈ రోడ్డున వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు హెచ్చరించినా నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. రోడ్ నెం. 45లోని మరో మూడు పబ్‌లు కూడా సరిపడ పార్కింగ్ లేకపోవడంతో ఫ్లై ఓవర్ కింద రోడ్డుకు రెండువైపులా, నివాసాల వద్ద పార్కింగ్ చేయాల్సి వస్తోంది. రాత్రి 10 నుంచి తెల్లవారుజామున 2 గంటల వరకు ఇళ్ల ముందు అక్రమంగా పార్కింగ్‌లు చేస్తున్న వాహనాలపై స్థానికులు డయల్ 100కు ఫిర్యాదు చేస్తున్నారు. పోలీసులు వెళ్లి చర్యలు తీసుకుంటున్నా తెల్లవారి యధావిధిగా ఇళ్ల ముందే పార్కింగ్ చేస్తున్నారు. రోడ్ నెం. 36లో పబ్‌లతో పాటు కృష్ణపట్నం రెస్టారెంట్‌తో పాటు క్రీం స్టోన్ ఐస్ క్రీం వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఆయా ప్రాంతాల్లోనూ అర్ధరాత్రి వరకు వాహనాలు రోడ్ల పక్కన పార్కింగ్ చేసి ఉంటున్నాయి. ఎయిర్‌లైవ్ పబ్ కస్టమర్లంతా తమ వాహనాలను రోడ్డుపక్కనే పార్కింగ్ చేస్తున్నారు. అంతర్గత రహదారుల్లోనూ పార్కింగ్‌లు చేస్తుండటంతో సమస్య నానాటికి తీవ్రమవుతోంది.

పత్తాలేని ట్రాఫిక్ పోలీసులు..

ట్రాఫిక్ పోలీసులు ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే విధుల్లో ఉంటున్నారు. జూబ్లీహిల్స్‌లో 29 పబ్‌లు, నాలుగు ఐస్‌క్రీం షాపులు, 12 రెస్టారెంట్లు రాత్రి 8 గంటల తర్వాతే ప్రారంభమవుతున్నాయి. సరిగ్గా ఆ సమయంలోనే జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు ఉండటం లేదు. ఫలితంగా కస్టమర్లు తమ వాహనాలను ఇష్టానుసారంగా రోడ్లపక్కనే పార్కింగ్ చేస్తున్నారు. అక్రమ పార్కింగ్‌లు అని బోర్డు ఉన్న చోట కూడా యథేచ్ఛగా పార్కింగ్ చేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఫుట్‌పాత్‌లు పూర్తిగా అక్రమ పార్కింగ్‌లతో మూసుకుపోతున్నాయి. రోడ్డు, ఫుట్‌పాత్, పార్కు, ఇళ్లు, ఖాళీ స్థలాలు అనే తేడా లేకుండా అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. రాత్రిపూట ట్రాఫిక్ పోలీసులు విధుల్లో ఉండి వీటిని నియంత్రిస్తే ట్రాఫిక్ సమస్య కొంత వరకు తగ్గుతుంది.

ఫ్యాట్ పీజియన్‌పై కేసు నమోదు



ఈ నెల 27న రాత్రి ఫ్యాట్ పీజియన్ వద్ద రెండువైపులా అక్రమ పార్కింగ్‌ల కారణంగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. అదే సమయంలో ఆ దారిలో వెళుతున్న ట్రాఫిక్ డీసీపీ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ బి.కిషోర్‌రాజ్ అతికష్టంగా ట్రాఫిక్‌ను నియంత్రించారు. రోడ్డుకు రెండువైపులా అక్రమ పార్కింగ్ చేసిన ఫ్యాట్ పీజియన్ పబ్ యజమాని కేతన్ అగర్వాల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతడిపై కేసు నమోదు చేశారు. గతంలో కూడా అక్రమ పార్కింగ్‌ల నేపథ్యంలో ఈ పబ్‌పై రెండుసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లుగా పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలను సదరు పబ్ యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణలో బీసీలకు అన్యాయం

నాగుల శ్రీనివాస్ యాదవ్



సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

రాంగోపాల్‌పేట్: తెలంగాణా రాష్ట్రంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక అధ్యక్షులు నాగుల శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం రెజిమెంటల్‌బజార్‌లోని రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర స్థాయి కమిటీ, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు, జిల్లాల అధ్యక్షులతో పాటు వివిధ సంఘాలకు చెందిన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తెలంగాణాలో బీసీ ముఖ్యమంత్రి అయినప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందని జనాభాలో మెజార్టీ ఉన్నా కూడా సరైన రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమం, అభివృద్ధిలో భాగస్వామ్యం లభించడం లేదన్నారు. రాష్ట్రంలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేదని 8500 ప్రాథమిక పాఠశాలలు మూసివేశారని, బీసీ కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి నిధులు కేటాయించలేదని విమర్శించారు. అభివృద్ధిలోనూ తెలంగాణ పూర్తిగా వెనకబడిపోయిందని, మూసీ ప్రక్షాళన, నాలాల వెడల్పు చేయకపోవడం, తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.20వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రం నేడు రూ.4.5లక్షల కోట్ల అప్పులతో నిండిపోయిందని విమర్శించారు. తెలంగాణ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించకపోవడం, పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయలేదని, తెలంగాణకు చెందిన సినీ హీరోలు లేరని, స్టూడియోలు, విద్యాసంస్థలు లేవని మండిపడ్డారు. ఈ సందర్భంగా తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రి వచ్చే వరకు ఐక్య ఉద్యమాలు, రాజకీయ చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకటదాసు, పిట్ల నగేష్ ముదిరాజ్, గగనం వెంకటస్వామి, వడ్డెర నర్సన్న, జగదీష్ యాదవ్, జగన్మోహన్ ముదిరాజ్, పరమేశ్వరి, వెంకటస్వామి, నాగేశ్వరరావు, సంపత్‌కుమార్, సుదర్శన్, రాంబాబు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేది రాజ్యాంగమే .. రాజదండం కాదు

ప్రొ.గాలి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్‌కుమార్

లాలాపేట: ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేది రాజ్యాంగమే కానీ.. రాజదండం కాదని దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొ. గాలి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత ప్రథమ పౌరురాలిగా, రాజ్యాంగ పరిరక్షకురాలిగా ఈ దేశ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే బాధ్యత భారత రాష్ట్రపతిపై ఉందన్నారు. కానీ.. మనుధర్మం ప్రకారం మహిళలకు ముఖ్యంగా ఆదివాసీ మహిళ అయినా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముచే పార్లమెంట్ భవనం ప్రారంభించడం నేరం అందుకే రాష్ట్రపతిచే నూతన పార్లమెంట్ భవనం ప్రారంభించే అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. గతంలో అయోధ్యలో రామ మందిర నిర్మాణ పునాది ప్రారంభం కూడా దళితుడైన అనాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో ప్రారంభించలేదని అది ఆర్‌ఎస్‌ఎస్ హైందవ ధర్మానికి వ్యతిరేకం అని గాలి వినోద్‌కుమార్ ఆరోపించారు.

వేసవి శిక్షణ శిబిరాలతో సృజనాత్మకత వెలికితీత



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అదనపు డీజీపీ సౌమ్యా మిశ్రా

రాంగోపాల్‌పేట్: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసి వాటికి పదును పెట్టేందుకు వేసవి శిక్షణా శిబిరాలు ఎంతో దోహదపడతాయని అదనపు డీజీపీ సౌమ్యా మిశ్రా అన్నారు. సికింద్రాబాద్ వైఎంసీఏలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరాల ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నెల రోజుల పాటు విభిన్న అంశాలు, క్రీడల్లో విద్యార్థులకు నిపుణుల ఆధ్వర్యంలో శిక్షణ పొందడం వారికి ఈ వేసవి సెలవులు ఆహ్లాదాన్ని నింపాయన్నారు. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో భవిష్యత్‌లో ఇప్పుడు వేసవి శిబిరాల్లో పొందిన శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. సికింద్రాబాద్ వైఎంసీఏ ఆధ్వర్యంలో 116వ వేసవి శిక్షణ శిబిరమని నెల రోజుల పాటు 26 అంశాల్లో 250 మందికి శిక్షణ అందించినట్లు గ్రేటర్ హైదరాబాద్ వైఎంసీఏ అధ్యక్షులు జయకర్ డేనియల్ తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణలో ప్రతిభ చూపిన వారికి బహుమతులతో పాటు పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన క్యాట్ వాక్‌లు, డ్యాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డీసీపీ ఇందిరా, వైఎంసీఏ ప్రధాన కార్యదర్శి లెనార్డ్, కార్యదర్శి కెన్నెత్, కోఆర్డినేటర్ ఎలియాస్ పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలి



టోర్నమెంట్ ప్రారంభించి బ్యాటింగ్ చేస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

రసూల్‌పురా: క్రీడలు దేహదారుఢ్యానికి ఎంతో దోహదపడుతాయని బీఆర్‌ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో శ్రీ గణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే ఎస్‌జీఎఫ్ సమ్మర్ సీజన్- 2 నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన శ్రీగణేష్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఇరువురు కాసేపు బ్యాటింగ్ చేశారు. మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా ఈ టోర్నమెంట్‌లో ఆడుతున్న క్రీడాకారులను చూస్తుంటే తన చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయని అన్నారు. శ్రీ గణేష్ మాట్లాడుతూ.. త్వరలో పాఠశాలల జిల్లాస్థాయి పోటీలను నిర్వహిస్తామన్నారు. ఎస్‌జీఎఫ్ క్రికెట్ టోర్నమెంట్‌కు స్పందన వచ్చిందని 32 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముప్పిడి మధుకర్, అరుణ్‌యాదవ్, శరత్ ఇమ్రాన్, లిఖేష్, ప్రతాప్, అనీల్ పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో దరఖాస్తులకు ఆహ్వానం

కాచిగూడ: సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణ కోసం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఇండియా డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ డిప్లొమా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో జూన్ 9లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. వివరాలకు సెల్: 7893141797 లేదా వెబ్‌సైట్: www.nacrindia.orfలో సంప్రదించాలని కోరారు.

జీర్ణ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

బంజారాహిల్స్: సాధారణ జీర్ణ సమస్యలను నివారించడానికి తల్లిదండ్రులు తమ పిల్లల పేగు ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలని ఒమేగా క్లినిక్స్ కన్సల్టెంట్ పీడియాట్రిషియన్ డాక్టర్ కె. పవన్ కుమార్ అన్నారు. ప్రపంచ జీర్ణ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ పిల్లల్లో సాధారణంగా కనిపించే పేగు సమస్యలు మలబద్ధకం, హైపర్ ఎసిడిటి, డయేరియాతో ప్రభావితం అవుతుందన్నారు. మలబద్ధకం 30 శాతం మంది పిల్లలను ప్రభావితం చేస్తుందన్నారు. ఇది పిల్లల్లో కడుపు నొప్పికి కారణం అవుతుందన్నారు. దేశంలోని 22-25 శాతం మంది శిశువులను హైపర్ ఎసిడిటి ప్రభావితం చేస్తుందన్నారు. రోగ నిరోధక, జీవక్రియ, నరాల ప్రవర్తన లక్షణాలతో సహా మానవ ఆరోగ్యంపై పేగుల్లో సూక్ష్మ జీవులు కీలకమైనవన్నారు. అందుకే పిల్లల పేగుల ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం ముఖ్యమన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు రోటా వైరస్, మీజిల్స్ వ్యాక్సిన్లతో సహా పిల్లలకు సరిగ్గా టీకాలు వేయడం ముఖ్యమని ఇది డయేరియాను నివారించడంలో భాగా సహాయ పడుతుందన్నారు. జీర్ణ సంబంధ సమస్యల లక్షణాలను గుర్తిస్తే వెంటనే పిల్లల డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. పిల్లల ఆహారంలో ఎక్కువ ఫైబర్ ఉండటంలో చూడటంతో పాటు వారికి తల్లిపాలు ఇవ్వడం, కొవ్వు పదార్థాలను తగ్గించడం, ప్రో బయోటిక్‌లను ఎంచుకోవడం మంచిదన్నారు. తగినంత నీరు కూడా ఇవ్వాలన్నారు.బయటికి వెళ్లి ఆడుకునేలా ప్రోత్సహించాలన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిరంతర కృషి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న లక్ష్మీ బాల్‌రెడ్డి

అమీర్‌పేట్: సనత్‌నగర్ డివిజన్ అభివృద్ధి కోసం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నిరంతరం కృషి చేస్తున్నారని కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని బాలయ్య నగర్‌లో మంత్రి చొరవతో మంజూరైన రూ. 21 లక్షలతో వీడీసీసీ రోడ్డు పనులను ఆదివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వాలు సనత్‌నగర్ డివిజన్‌ను పట్టించుకోకపోవడంతో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కృషితో సనత్‌నగర్ అభివృద్ధి కోసం వందల కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధికి బాటలు వేశారన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని అభివృద్ధి పథకాలను అమలు చేసే ప్రభుత్వం అన్నారు. ప్రజల సహకారంతో సనత్‌నగర్ డివిజన్ అభివృద్ధి కోసం తాను నిరంతరం శ్రమిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బాల్‌రెడ్డి, సురేష్, వెంకన్న, ఈశ్వర్, అంజయ్య, నర్సింహగౌడ్, పురుశోత్తం, సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష



దీక్షలో పాల్గొన్న ముదిరాజ్ సంఘం నాయకులు

లాలాపేట: చేయిచేయి కలుపుదాం భవిష్యత్ తరానికి హాస్పిటల్ నిర్మిద్దామంటూ మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష 55 రోజులకు చేరింది. ఆదివారం బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు పోచయ్యయాదవ్, బీఆర్‌ఎస్ యూత్ వింగ్ గ్రేటర్ అధ్యక్షులు ఆలకుంట హరి ప్రారంభించి దీక్షను ప్రారంభించి మాట్లాడారు. హాస్పిటల్ ఏర్పాటు చేసే వరకు ఆందోళనలు విరమించేది లేదన్నారు. ప్రభుత్వం స్పందించి ఆస్పత్రి ఏర్పాటుపై కచ్చితమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాణికేశ్వర్‌నగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బాలయ్య, అశోక్‌కుమార్, సాయిబాబా, విష్ణు, కృష్ణప్రసాద్, వెంకటేషం, ముత్యం, పవన్, రాజు, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

మోదీ హయాంలో ప్రజాస్వామ్యం అపహాస్యం

లిబర్టీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ ప్రతినిధి రాష్ట్రపతిని అవమానించిందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు, వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును ఆహ్వానించకుండా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని అవమానించారన్నారు. ఆదివారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ ఆదివాసీ మహిళ అయినందునే రాష్ట్రపతిని చిన్న చూపు చూశారన్నారు. రాష్ట్రపతిని పిలవకుండా ఏకపక్షంగా పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న ఆంజనేయ గౌడ్

రసూల్‌పురా: సీఎం కప్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మన్ ఆంజనేయ గౌడ్ అన్నారు. సీఎం కప్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సుధాకర్‌తో కలిసి ఆదివారం సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ గ్రామాలు, జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడం అద్భుతమని అన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం ప్రొఫెషనల్ కోర్సుల్లో 0.5, ప్రభుత్వ ఉద్యోగాలలో 2 శాతం రిజర్వేషన్స్ కల్పిస్తుందని అన్నారు. సుధాకర్ మాట్లాడుతూ.. నాలుగు రోజుల పాటు జరిగే ఖోఖో పోటీల్లో 33 జిల్లాలకు చెందిన బాలుర బాలికలు పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ సెక్రటరీ కృష్ణమూర్తి, ఇన్‌చార్జ్ సాయన్న, వివిధ జిల్లాల పీఈటీలు, పీడీలు క్రీడాకారులు పాల్గొన్నారు.

ఓట్ల పునరుద్ధరణకు పోరాడుదాం



మాట్లాడుతున్న క్రిశాంక్

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో తొలగించిన 35 వేల ఓట్లను పునరుద్ధరించేందుకు రాష్ట్ర ఐటీ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. శనివారం రాత్రి బొల్లారం ఆదర్శనగర్‌లో పదవ బస్తీనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం క్రిశాంక్ మాట్లాడుతూ.. ఓట్ల తొలగింపు విషయమై కేటీఆర్ స్పందించి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు లేఖ రాశారని ఓటు హక్కు కోసం అందరం కలిసి పోరాడుదామని అన్నారు. ఈ సందర్భంగా స్థానికులతో కలిసి ఓటు హక్కు పునరుద్ధరించాలని రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖలు రాశారు. అనంతరం బస్తీనిద్రలో పాల్గొన్న స్థానికులతో కలిసి సహపంక్తి భోజనం చేసి అనంతరం వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రాజేష్, వేణు, సతీష్, రాహుల్, రంజిత్, మోని, రఘు, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు ఆదివారం మోండా మార్కెట్ డివిజన్‌లోని రెజిమెంటల్‌బజార్‌లో ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు గౌరిశంకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..బీసీ, బలహీన, అట్టడుగు వర్గాల ప్రజలకు రాజకీయ చైతన్యాన్ని అందించి, ప్రోత్సహించిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో నరహరి, ఆనంద్, షేక్ బాబు, నాందేవ్, సీపీ అశోక్‌యాదవ్, నిసార్ భాయ్, శ్రీధర్, మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

రసూల్‌పూరాలో..

రాంగోపాల్‌పేట్: ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా ఆదివారం రసూల్‌పూరాలోని ఎన్టీఆర్ విగ్రహానికి మర్రి శశిధర్‌రెడ్డి నాయకులు నందు, శ్రవణ్, దయానంద్, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, రఘు, రమేష్ కుమార్, యూసుఫ్‌తో కలిసి నివాళి అర్పించారు.

తార్నాకలో..

లాలాపేట: నందమూరి తారక రామారావు శతజయంతి వేడుకలను ఆదివారం తార్నాక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తార్నాక చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నాయకులు గండికోట విజయ్‌కుమార్, రమేష్, మురళీకృష్ణ, విజయ్‌కుమార్, పేపర్ శ్రీను, రాజేష్, నవీన్ నివాళి అర్పించారు.